క్లుప్తంగా

షాదీ తోఫాకు ఐదు దరఖాస్తులు

శిరివెళ్ల: మండలంలో షాదీ తోఫాకు 5 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి 3, బోయలకుంట్ల నుంచి రెండు దరఖాస్తులు అందాయని చెప్పారు. పేద ముస్లిం యువతులకు వివాహ నిమిత్తం ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తుందని, అర్హత గల వారు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు.

బాల బాలికలకు పోటీలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బాలాజీ మర్చెంట్ కమిటీ కల్యాణ మండపంలో బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం బాల బాలికలకు హిందూ సంప్రదాయ వస్త్రాధారణ, కేషాలంకరణ పోటీలు నిర్వహించారు. మొదటి విభాగం బాలలకు 6-10 సంవత్సరాల్లోపు, రెండో విభాగంలో 7-11 సంవత్సరాల బాలికలకు, మూడో విభాగం 12- 14 సంవత్సరాల బాలికలకు పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో 50 మంది చిన్నారులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఖాదరబాద్ సత్యవతి, శైలజ, గెలివి లీనా వ్యవహరించారు. అధ్యక్షుడు కొశెట్టి కృష్ణమూర్తి, నారాయణ శ్రీనివాస్, దేసు చంద్రగుప్త, మిర్యాల చంద్రమౌళి, గీతా వాసవి,నాగరత్నమ్మ,మల్లిక,లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యనందించండి

శిరివెళ్ల: విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని ఎంఈఓ శోభావివేకవతి తెలిపారు. సోమవారం పాఠశాల సూక్ష్మ ప్రణాళికపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రదానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బోధించే పాఠాలపై 10 రోజుల వరకు సరిపడ లెసన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. లెసన్ ప్లాన్ ఆధారంగా ప్రతి రోజూ డైరీ విధిగా రాయాలని, పరీక్షల నిర్వహణ అనంతరం పేపర్లు మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. 0-3 ఏళ్ల చిన్నారులు ఎంత మంది ఉన్నారు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్నారా అనే సమాచారం సేకరించాలన్నారు. ఏటా జూన్, జూలై నెలల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలని,ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.స్కూల్ కాంపెక్స్ హెచ్ఎంలు విజయకుమార్, నాగలక్ష్మి,సీఆర్పీలు గుర్రప్ప, అన్సర్, పుల్లయ్య పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 1ను రద్దుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ రద్దు చేయకపోతే రెవెన్యూ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టనున్నామన్నారు. ఫిబ్రవరి 8న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర వ్యాప్త ప్రాజెక్టుల పరిశీలన చేపట్టనున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 నుంచి బస్సు యాత్రలు ప్రారంభం కానుందని చెప్పారు. నాయకులు రంగనాయుడు, బాబాఫకృద్దీన్, ప్రసాద్, సుంకయ్య, సుగుణమ్మ, ధనుంజయ, నాగరాముడు, శివయ్య, ప్రభాకర్, రఘురాం పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి

నంద్యాల(అర్బన్): కులాల జనాభా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్లను 50 శాతం నుంచి 80 శాతానికి పెంచేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. 75 ఏళ్లగా కులాల రిజర్వేషన్లు 50 శాతానికి మించలేదని, పెరిగిన జనాభా ప్రకారం ఆ శాతాన్ని పెంచేలా ప్రభుత్వాలను ఒప్పించాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు సంఘం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారని గుర్తు చేశారు.

గృహ ధ్రువ పత్రాల పంపిణీ



పత్రాలు అందజేస్తున్న ఆరిఫ్, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): స్థానిక ఎస్సార్బీసీలోనున్న జగనన్న నగర్‌లో (టిడ్కో) గృహాలను కౌన్సిలర్లు, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ అర్హులందరికీ జగనన్న నగర్‌లో ఉన్న టిడ్కో గృహాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు ఇంటి తాళాలను అందజేస్తున్నామని చెప్పారు. అలాగే పట్టాలు పొందిన వారు త్వరితగతిన గృహాల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రశేఖర్, విజయభాస్కర్, సాదిక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

రుద్రవరం: పేరూరులో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి అధికారులు, సర్పంచ్ కోనేటి దేవదానం సోమవారం భూమిపూజ చేశారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సరైన భవనం లేక ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం దాదాపు రూ.16.5 లక్షలు మంజూరు చేయడంతో అధికారులు భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్ కోరారు.

నీటి సమస్యకు చెక్

- 'జలజీవన్' మిషన్ కింద మండలానికి రూ. రూ.633.2 లక్షలు మంజూరు
- ఆరు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్
- త్వరలో ప్రారంభం కానున్న పనులు

ఏళ్లుగా నెలకొన్న ప్రజల దాహార్తి కష్టాలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జలజీవన్ మిషన్ పథకం కింద మండలానికి రూ.633.2లక్షలు మంజూరు చేసింది. వీటితో ఆరు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించడం, మొత్తం గ్రామాలకు నూతన పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి వేయాలని నిర్ణయించింది.

దొర్నిపాడు: మండల సమీపంలో కుందూ ప్రవహిస్తున్నా ఆయా గ్రామాల్లో నీటి సమస్య ప్రహసనంగా మారింది. పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రజలకు కష్టాలు కొనసాగాయి. వర్షాకాలంలో సైతం తాగునీటికి ఇబ్బందులు పడేవారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇక వేసవిలో సమస్య ఇంకా తీవ్రంగా ఉండేది. గ్రామీణులు సుదూర ప్రాంతాలకు, వ్యవసాయ బోరు బోవుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొని గొంతులు తడుపుకునే వారు. ఉమాపతినగర్ లాంటి ప్రాముఖ్యత ఉన్న గ్రామాల్లో ఎవరైనా తాగునీరు అడిగితే కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నారు గ్రామస్తులు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ సమస్యలకు చెక్ పెట్టేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద మండలానికి రూ.633.2లక్షలు విడుదల చేసింది.

ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం ఇలా..

మంజూరైన నిధులతో దొర్నిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, ఉమాపతినగరం, క్రిష్టిపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించనున్నారు. అలాగే మొత్తం 2,017 కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయనున్నారు.

సమస్యలు ఇలా..

- రామచంద్రా పురంలో ఓవర్ హెడ్ ట్యాంక శిథిలం కావడంతో నీరంతా లీకవుతోందని స్థానికులు ఇటీవల జరిగిన గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ.. ప్రతిపాదనలు పంపి నూతన ట్యాంకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం గ్రామానికి నూతన ట్యాంకు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- ఉమాపతినగరంలో పైపులు, ఓవర్‌హెడ్ ట్యాంక్ దెబ్బతినడంతో పదిహేనళ్ల నుంచి వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు అవసరాలకు కుంట నీటిని వాడుకుంటున్నారు.
- క్రిష్టిపాడులో ప్రస్తుతం ట్యాంక్ ఉన్నప్పటికీ ఎస్సీ కాలనీకి డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తుండటంతో నీరంతా వృథా అవుతుంది. అదనపు ట్యాంక్ మంజూరు చేయాలని ఏళ్లుగా కోరుతున్నా పరిష్కరించలేదు.
- దొర్నిపాడులోని ట్యాంక్ శిథిలమై మండల కేంద్రం వాసులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎప్పుడు కూలుతుందోనని ట్యాంకును శుభ్రం చేసేందుకు పైకి ఎక్కడానికి సిబ్బంది భయపడుతున్నారు.
- బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాలకు ప్రస్తుతం ఉన్న ట్యాంకుల నీరు సరిపోకపోవడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



రామచంద్రాపురంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్

గ్రామాల వారీగా మంజూరైన నిధులు..

గ్రామం	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
అర్జునాపురం	24.30
బుర్రారెడ్డిపల్లె	52.90
చాకరాజువేముల	71.90
దొర్నిపాడు	119.90
గుండుపాపల	32.90
ఉమాపతినగరం	54.90
భాగ్యనగరం	36.10
క్రిష్టిపాడు	55.50
రామచంద్రాపురం	39.90
డబ్ల్యూ.గోవిందిన్నె	67.70
డబ్ల్యూ.కొత్తపల్లె	117.10
మొత్తం	633.2

ట్యాంకు మంజూరు చేయడం సంతోషం



గ్రామానికి ట్యాంకు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామంలో ట్యాంకు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం అవసరాలకు గ్రామంలోని కుంట నీటిని ఉపయోగిస్తున్నాం. ట్యాంక్ నిర్మాణం పూర్తయితే మంచినీటి సమస్య పూర్తిగా తొలగనుంది. – చంద్ర, ఉమాపతినగరం

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు



గ్రామంలో వంద శాతం ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తాం. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలతో గ్రామాల్లో మంచినీటి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతంది. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. – సుప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దొర్నిపాడు

ఆకుకూరలతో ఆరోగ్యం

దొర్నిపాడు : తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా ఆకుకూరలు, పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ నాగేంద్ర సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 35 మంది గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు గర్భిణులకు రక్తం తక్కువగా ఉండటంతో నంద్యాలకు రెఫర్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు సురక్షితమని, ప్రస్తుతం అన్ని రకాల వసతులు ఆసుపత్రిలో ఉన్నాయని, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

సమాజాభివృద్ధికి కృషి చేయాలి

గోస్పాడు: సమాజాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైద్యాధికారి గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో 'విద్యార్థులు-సమాజం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.వారు మాట్లాడుతూ అరాచకాలు, అఘాయిత్యాలు, మోసాలు, విద్యాలయాల్లో ర్యాగింగ్‌లు ఆత్మహత్యకు ప్రేరేపించేలా పలు అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని వాటిని నివారించడంలో విద్యార్థి దశ నుంచే కీలకపాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గోస్పాడు: పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను సోమవారం ఎంఈఓ అబ్దుల్‌కరీం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు, నాయకులు భాస్కరుడు, వేణునాథ్, శంకరయ్య, రాజశేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు నాయక్, వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర.. దేశ రాజకీయాల్లో ఓ సంచలనం

నంద్యాల(అర్బన్): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2017లో చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర దేశ రాజకీయాల్లోనే సంచలనమని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. యాత్ర రాష్ట్ర ప్రజల్లో చైతన్యాన్ని నింపి చారిత్రాత్మక తీర్పునిచ్చి, దేశంలో ఏ నాయకుడికి లభించనంత ఆదరణ లభించిందని చెప్పారు. సంకల్ప యాత్ర నేటితో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే శిల్పా నివాస గృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పట్టణంలోనున్న వైఎస్సార్ విగ్రహాలకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతోల కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ 341 రోజుల పాటు 3648 కి.మీ మేర సాగిన యాత్రలో ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని, ముఖ్యమంత్రి అయిన తర్వాత నవరత్నాల పేరుతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ పరిస్థితులు సహకరించకపోయినా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగించి దేశానికే ఆదర్శంగా నిలిచారని, పథకాల అమలుపై ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నా, అడుగడునా అడ్డంకులు సృష్టిస్తున్నా వాటిని దాటుకొని సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్నన పొందారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన, ఇవ్వని హామీలనన్నింటిని నెరవేర్చి ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరుగాంచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు చంద్రశేఖర్, శశికళారెడ్డి, సునీత అమృతరాజ్, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రజాసంకల్ప యాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 'నవరత్నాలతో' రాష్ట్రంలో సంక్షేమ బాట పరిచారని వైఎస్సార్‌సీపీ నాయకులు మాదం చెన్నయ్య అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసుకుని నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాదం కిశోర్, మాలమహానాడు నాయకులు దశమి ప్రసాద్ ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు, ఒంటిద్దుపల్లె గ్రామాలకు చెందిన రైతులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందనలో వినతులు అందజేసి భూ సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బోడెమ్మనూరు గ్రామానికి చెందిన రైతు బచ్చు నాగిరెడ్డి సర్వే నంబర్ 32-2లో 0.45 ఎకరాల భూమిని 1996లో కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా పొందాడు, తన అనుభవంలోనున్న భూమిని మరో రైతు పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, మార్చాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా పరిష్కరించలేదంటూ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ఒంటిద్దుపల్లె గ్రామానికి చెందిన హుసేన్‌రెడ్డి, చెవిరెడ్డి మధ్య నెలకొన్న 0.68 ఎకరాల భూ వివాదానికి సంబంధించి సమస్య పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ పలుమార్లు వీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోరారు. తహసీల్దార్ స్పందిస్తూ వారం లోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని రైతులకు హామినిచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో వచ్చిన అర్జీలకు వీఆర్‌ఓలు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏఓ రాజేంద్రకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ పాల్గొన్నారు.



స్పందనలో తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేస్తున్న రైతులు

రేషన్ బియ్యం స్వాధీనం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఓ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 14.5 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. కోవెలకుంట మండలం గుళ్లదూర్తి గ్రామానికి చెందిన చిన్న నరసింహుడు, నల్లగట్ల నరసింహుడు గ్రామస్తుల నుంచి బియ్యం సేకరించి ఓ ఇంటి వద్ద నిల్వ ఉంచారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మున్సిపల్ స్పందనకు రెండు వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పర్యవేక్షణలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు వచ్చాయన్నారు. పట్టణంలోని 43 సచివాలయాల్లో నిర్వహిస్తున్న రోజువారీ స్పందనలో వార్డులలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున వినతులు తగ్గాయని చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ వరమద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీల కూలి పెంచాలి

నంద్యాల(అర్బన్): టెక్కె మార్కెట్ యార్డులో పని చేస్తున్న సివిల్ సప్లయీస్ హమాలీల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, హమాలీ యూనియన్ కార్యదర్శి గోపాల్ కోరారు. కూలి తో పాటు దసరా బోనస్ చెల్లించాలని కోరుతూ కార్మికులు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా హమాలీల కూలి రేట్లు పెంచాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నాయకులు దస్తగిరి, యాకుబ్ పాల్గొన్నారు.

కేఆర్ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, కృష్ణా నదికి ఏ మాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పునఃసమీక్షించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి కోరారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో తాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 17న నంద్యాల కేంద్రంగా సత్యాగ్రహం చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు సహదేవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామన్న, వెంకటరమణయ్య, కృష్ణారెడ్డి, శంకరయ్య, చింతలకుమార్, పులికొండన్న, నసరుల్లాఖాన్, భాస్కరరెడ్డి, బాలీశ్వరరెడ్డి, ప్రసాదరెడ్డి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్ రెడ్డి

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(సిటీ): జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్న జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పీజీ, బీ టెక్ తదితర విద్యార్హతలు కలిగిన వారికి 13 జాతీయ సంస్థల ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 9533631002, 6303397635నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

నంద్యాల(రూరల్): విద్యుత్ ప్రమాదానికి గురై నంద్యాల జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అవుకు మండల కేంద్రానికి చెందిన కంబగిరి, తన కూతురు జానకిని ప్రభుత్వం ఆదుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న ఈశ్వరయ్య మాదిగ కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో బాధితులతో కలిసి ఆయన అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంబగిరి ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. అయితే గత నెల 11న కంబగిరి, తన కూతురుతో కలిసి తన ఇంటి పైకి వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ , అవుకు మండల అధ్యక్షులు మద్దిలేటిస్వామి, మద్దిలేటి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెనూ పాటించని వసతి గృహాలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(సిటీ): మెనూ పాటించని వసతి గృహాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎస్సీ ప్రీ మెట్రిక్ వసతి గృహంలో వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంకన్న, వసతి గృహాలను పరిశీలించని ఏఎస్‌డబ్ల్యూఓ సుబ్బారెడ్డి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నూనెపల్లె శివాలయంలో సోమవారం అయ్యప్పస్వాములకు జమాతే ఉలెమా అధ్యక్షుడు మౌలానా ఖలీల్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, గన్ని మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గన్ని కరీంల ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మానవతా హృదయంతో భక్తులకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో 40 రోజుల పాటు నిష్టతో ఉన్న స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం పుణ్యప్రదమన్నారు. కార్యక్రమంలో ఖలీల్ అహమ్మద్, హఫీజ్, అన్వర్‌హుసేన్, అఫీజ్ అబ్దుల్ రహిమాన్, అలీ, కలాం, మౌలానా రఫీ, గురుస్వామి లక్ష్మయ్యలు పాల్గొన్నారు.



అయ్యప్ప మాలధారులకు భోజనం వడ్డిస్తున్న ముస్లింలు

కుందూ తీరం.. వరి నాట్లు ముమ్మరం

ఉయ్యాలవాడ : కుందూ నదిలో పుష్కలంగా నీటి ప్రవాహం ఉంది. నదీ తీరం వెంట రైతులు రెండో పంట సాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిళ్లు పూర్తవడంతో ప్రస్తుతం మళ్లీ వరి పంట సాగు చేస్తున్నారు. మండలంలోని 14 గ్రామాలకు తాగు, సాగు నీటికి కుందూనది జలాలే ఆధారం. మండలంలో నదీ తీరం వెంట ఖరీఫ్ మొదటి పంటగా వరి 2,500 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాకు 40 నుంచి 44 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. పెట్టుబడులు పోనూ రైతుకు గిట్టుబాటు లభించింది. శ్రీశైలం, అవుకు రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉండడంతో ఉయ్యాలవాడ, రూపనగుడి, మాయలూరు, బోడెమ్మనూరు, కాకరవాడ, నర్సిపల్లె, హరివరం, సుద్దమల్ల, తదితర గ్రామాల్లో ఎక్కువ శాతం రైతులు వరి పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలో దాదాపు 2వేల ఎకరాల్లో వరి నాట్లు వేసే అవకాశం వుందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ పేర్కొన్నారు.



ఉయ్యాలవాడ, రూపనగుడి మధ్య కుందూలో నీటి ప్రవాహం



రూపనగుడి సమీపంలో పొలాన్ని ట్రాక్టర్‌తో సిద్ధం చేస్తున్న రైతు



మాయలూరు సమీపంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పుష్కలంగా నీరు



ఇలాంటి రోజులు పది సంవత్సరాల క్రితం చూశాం. మళ్లీ ఇప్పుడు కుందూనది మూడు సంవత్సరాలుగా జీవనదిలా ప్రవహిస్తోంది. వరితో పాటు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, సోయాబీన్, కొర్ర సాగు చేస్తున్నాం. – కర్నాటి రామక్రిష్ణారెడ్డి, రైతు, బోడెమ్మనూరు

చివరి వరకు నీరు అందించాలి



వరి పంట చేతికి వచ్చేంత వరకు కుందూ నదిలో నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 45 బస్తాల దిగుబడులు వచ్చాయి. రెండో పంట మళ్లీ రెండు ఎకరాల్లో వరి నాట్లు వేయిస్తున్నా. – సిద్దంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, రూపనగుడి

టెంకాయల వేలం వాయిదా

బండిఆత్మకూరు : ఓంకార క్షేత్రంలో టెంకాయల వేలం పాట వాయిదా పడింది. గతేడాది రూ. 6.70 లక్షలకు వేలం పాట జరగగా, ఈ ఏడాది అత్యధికంగా రూ. 6.30 లక్షలకు వేలం పాడారు. గతేడాదికంటే తక్కువ ఉండటంతో వేలంను వాయిదా వేసినట్లు ఈఓ మోహన్ తెలిపారు. ఇదే క్రమంలో ఐసు బండ్ల వేలం కూడా వాయిదా పడింది. కూల్‌డ్రింక్స్‌కు వేలం జరగగా రూ. 2.11 లక్షల ఆదాయం, పాద రక్షలకు రూ.1.36 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ వివరించారు.

జగనన్న కాలనీలో వసతుల కల్పన

ఉయ్యాలవాడ : మండలంలోని సర్వాయిపల్లె, ఆర్.పాంపల్లె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాలోని జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉయ్యాలవాడ లేఅవుట్ కాలనీలో ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టారు. అలాగే నీరు, విద్యుత్, నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని సమకూర్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తామని, ఇందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం